యువత చేతిలో రాజకీయ పార్టీల భవితవ్యం

- యువత నాడి పట్టిన వారే పాలకులు
- సత్తెనపల్లి నియోజకవర్గంలో పెరిగిన నూతన ఓటర్లు
- 20–39 ఏళ్లలోపు 1,04,772 మంది..
- 18–19 ఏళ్ల లోపు వారు 4,462 మంది..
- కొనసాగుతున్న ఫారం–6 దరఖాస్తులు స్వీకరణ

ఐదేళ్లకోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల భవితవ్యం యువత చేతుల్లోనే ఉంటుంది. ఆ దిశగా కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరూ ఓటరుగా నమోదు చేసుకొని, ఆ హక్కును వినియోగించుకునేందుకు అధికార యంత్రాంగం చైతన్యం తీసుకొచ్చింది. అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. సాధారణ ఎన్నికల షెడ్యూల్ తేదీ మరికొద్ది రోజుల్లోనే విడుదలయ్యే అవకాశం ఉండడంతో అధికారుల్లో హడావుడి నెలకొంది. అధికార యంత్రాంగం ఇప్పటికే ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టగా, తాజాగా పోలింగ్ శాతం పెంపు లక్ష్యంగా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

సత్తెనపల్లి: నియోజకవర్గంలో ఈ సారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోవటములను శాసించేది యువతే. తాజా ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,39,077 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 20–39 యాళ్లలోపు 1,04,772 మంది ఉంటే, 18–19 ఏళ్ల లోపు వారు 4,462 మంది ఓటర్లు ఉండటం గమనార్హం. ఈ లెక్కన రాజకీయ పార్టీలు యువ ఓటర్లను ఆకట్టుకునేలా కృషి చేస్తున్నాయి. 67.80 శాతం ఓట్లు 50 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు ఉంటే, 39 ఏళ్ల లోపు 45.69 శాతం మంది ఉన్నారు. ఫారం–6 దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతూ ఉండడంతో ఎన్నికల నాటికి యువ ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. 18 ఏళ్ల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా పటిష్ట ప్రణాళిక అమల్లోకి తీసుకువచ్చింది. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టగా తాజాగా పోలింగ్ పెంపే లక్ష్యంగా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

మొదలైన ఎన్నికల సందడి

సత్తెనపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 274 పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే మౌలిక సౌకర్యాల కల్పనపై అధికారం యంత్రాంగం దృష్టి పెట్టింది. ఈవీఎంల భద్రత కోసం స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు, వాటిని పోలింగ్ బూత్‌లకు చేర్చేందుకు బస్సుల సంఖ్య, రూట్ల ఎంపికపై ప్రణాళికలు పూర్తి చేశారు. సెక్టోరియల్, సూక్ష్మ పరిశీలనకు, రూట్ అధికారులు, పోలింగ్ బూత్‌లలో అవసరమయ్యే ఎన్నికల సిబ్బంది ఎంపిక దాదాపు పూర్తి కావచ్చింది. అధికారులు సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు కృషి చేస్తున్నారు.


నందిగామలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ

అభివృద్ధికి పట్టం కడతాం


18 ఏళ్ల నిండడంతో నాకు ఓటు హక్కు తొలిసారి కల్పించారు. తొలి ఓటు పేదల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పని చేసే నాయకులకే వేస్తా. యువత మేలుకోరే పార్టీకి మద్దతుగా నిలుస్తా. భవిష్యత్తులో అన్ని విధాలా మేలు చేకూర్చే పార్టీని ఎంపిక చేసుకుంటా.

–గంటా గోపీ, కొత్త ఓటరు, సత్తెనపల్లి

సంతోషంగా ఉంది


వచ్చే ఎన్నికల్లో నా తొలి ఓటు సద్వినియోగం చేసుకుంటా. తొలిసారి నాకు ఓటు హక్కు కల్పించారు. జాబితాలో పేరు కూడా వచ్చింది. మంచి పాలన, నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే పార్టీకే మద్దతుగా ఉంటా. అన్ని విధాల ఆలోచించి మంచి చేసే నాయకత్వానికే నా ఓటు వేస్తా.

–చొప్పరపు.లక్ష్మి, కొత్త ఓటరు, సత్తెనపల్లి


ఓటరు జాబితా

నియోజకవర్గంలో వయస్సుల వారీగా ఓటర్లు

వయస్సు	సత్తెనపల్లి టౌన్	సత్తెనపల్లి రూరల్	ముప్పాళ్ళ	రాజుపాలెం	నకరికల్లు	మొత్తం
18–19	1,025	1,082	559	718	1,078	4,462
20–29	8,435	10,556	5,908	7,318	9,676	41,893
30–39	12,471	16,277	9,377	12,095	12,659	62,879
40–49	10,448	13,373	7,219	9,126	12,707	52,873
50–59	7,679	9,859	5,882	6,310	8,809	38,539
60–69	4,710	6,124	3,992	3,852	5,117	23,795
70–79	2,009	2,754	1,865	1,949	2,581	11,158
80–89	490	783	353	563	722	3,111
90–99	46	93	69	73	86	367
మొత్తం	47,313	60,901	35,424	42,004	53,435	2,39,077

క్లుప్తంగా

పల్నాడు ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు

– జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. పట్టణంలోని చిన్న మసీద్ సెంటర్‌లో అత్యాధునిక పరికరాలతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కోట సైదయ్య నేత్రాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన వైద్య సేవలు అందించి రోగుల నమ్మకం చూరగొనాలన్నారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ఆప్టికల్ ఫార్మసీని, డీఎం అండ్ హెచ్ఓ రవి కుమార్ ఓపీ రూమ్‌ని, ఓటీ థియేటర్‌ను డాక్టర్ రామలింగా రెడ్డి, ఏ స్కాన్ రూమ్‌ను డాక్టర్ పొట్టి సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆళ్ల స్థిమిత, పట్టణంలోని పలువురు డాక్టర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

ముప్పాళ్ళ: మండలంలోని మాదల గ్రామంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవాలయంలో శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం ఈ నెల 23న జరుగుతుందని ఆలయ పూజారి చిమటా పోలురాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గురజాలలో..

గురజాల : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాముల కల్యాణ మహోత్సవం శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వామి వార్ల కల్యాణం జరుగుతుందని అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

నేడు దమ్మాలపాడులో 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం

ముప్పాళ్ళ: మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో ఈ నెల 23న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యులు శిబిరంలో పాల్గొని, వైద్య సేవలందిస్తారని, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



నకరికల్లు: లింగనిర్ధారణ పరీక్షలు, గర్భస్రావం చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ టి.శ్రీలత హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్, పల్స్‌పోలియోపై అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్‌ఎంలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల యోగక్షేమాలు కుటుంబ సభ్యుల బాధ్యత అని స్పష్టం చేశారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మణికంఠ, ఏసీడీపీఓ సంతోషి కుమారి, సూపర్‌వైజర్లు షేక్.రమీజున్, జె.నాగమణి, ఆనందకుమారి పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత ముఖ్యం

రాజుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బేటి బచావో–బేటి పడావో కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఆర్కే రమాదేవి పాల్గొని, మాట్లాడారు. బాలికలు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించాలని, లింగ వివక్షపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, సూపర్‌వైజర్ బి.ప్రసన్నరాణి, ఎస్.స్వర్ణలత, పాల్గొన్నారు.

బీసీ సదస్సుకు భారీగా తరలిన అభిమానులు



అచ్చంపేట: క్రోసూరులో నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ బీసీ సదస్సుకు మండలం నుంచి భారీగా అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం తరలి వెళ్లారు. నర్సరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త అనిల్ కుమార్‌యాదవ్‌కు స్వాగతం పలికేందుకు బైకు ర్యాలీ నిర్వహించారు.

మార్మోగిన ప్రసన్నాంజనేయస్వామి నామ స్మరణ

గారపాడులో వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవం

పెదకూరపాడు: మండలంలోని గారపాడు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ప్రసన్నాంజనేయ స్వామి నామస్మరణతో మార్మోగింది. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన హనుమాన్ భక్తులతో గ్రామం కళకళలాడింది. కుల మతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కోటి రూపాయలతో నిర్మించిన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పునఃప్రతిష్టా మహోత్సవం అంగరంగా వైభవంగా గురువారం నిర్వహించారు. వేదపండితులు శ్రీపతి స్వామీజీ ఆధ్వర్యంలో రుత్వికుల బృందం నూతన ధ్వజస్తంభం, మూల విరాట్‌ను ఉదయం 9.35 నిమిషాలకు ప్రతిష్ఠించారు. హోమం నిర్వహించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ ప్రారంభించారు. నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం భక్తులను ఆకట్టుకుంది. నిర్వాహకులు కంకణాల శివాజి, జెడ్పీటీసీ సభ్యులు కంకణాల స్వర్ణకుమారి గణేష్ మాధవరావు, కమిటీ సభ్యులు భక్తులకు ఏలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో బందొబస్తు నిర్వహించారు.


ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


రుత్వికులు బృందం ఆధ్వర్యంలో హోమం నిర్వహిస్తున్న దంపతులు

గుణాత్మక విద్యకు ఆజాద్ బాటలు

సత్తెనపల్లి: గుణాత్మక విద్యకు బాటలు వేసిన తొలి బాటసారి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని బీసీ సంఘాల నాయకులు అన్నారు. పట్టణంలోని పాత బస్టాండు సెంటర్‌లో సంఘాల ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 66వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని గుర్తుచేశారు. విద్యయే గురువు, విదేశాలలో మనకు బంధువు వంటిదని పేర్కొన్న మహనీయుడు ఆజాద్ అని కొనియాడారు. మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆయన ఎన్నో వినూత్న సంస్కరణలు తీసుకొచ్చి.. 11 ఏళ్ల పాటు సేవలందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బూర్సు శ్రీనివాసరావు, గుంజి విజయ్, టైలర్ క్యాలిబర్ జానీ, కుమ్మరి దస్తగిరి, షేక్ చిన్న షరీఫ్, ప్రత్తిపాటి హరే కృష్ణ, పిక్కిలి రత్తయ్య, పిల్లకతుపుల నాగేశ్వరరావు, బుర్సా సాంబయ్య పాల్గొన్నారు.


అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

విశ్రాంత హెచ్‌ఎం రమాదేవికి గోదావరి కీర్తి అవార్డు

సత్తెనపల్లి: ఫిలాంత్రాఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంత హెచ్‌ఎం, రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి 'గోదావరి కీర్తి' అవార్డ్‌ను ఈ నెల 21న రాజ మహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాలులో ప్రదానం చేశారు. సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధ శాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ఎంపీ మార్గాని భరత్ రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గోదావరి కీర్తి అవార్డ్, సర్టిఫికెట్స్, గోదావరి కళాదర్బార్ మెమెంటో, కడియం, కిరీటం, ముత్యాల హారం ఇచ్చి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సరికొండ రమాదేవిని గురువారం సత్తెనపల్లిలోని పలువురు ప్రముఖులు అభినందించారు.


అవార్డు అందుకుంటున్న రమాదేవి

పెనుగంచిప్రోలుకు మాలధారులు

నకరికల్లు: శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు అమ్మ మాలధారులు అధిక సంఖ్యలో పెనుగంచిప్రోలుకు బయలుదేరారు. 40 రోజుల దీక్ష పూర్తిచేసుకున్న మాలధారులు యాత్రకు గురువారం భక్తిశ్రద్ధలతో పయనమయ్యారు. స్థానిక అద్దంకి– నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన గల శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి ధరించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు విశేష పూజల్లో పాల్గొన్నారు.



గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్..

- 2024–25 అకడమిక్ ఇయర్‌కు ప్రవేశాలు
- అప్‌గ్రేడ్‌కు సహకరించిన మంత్రి అంబటికి నేతల ధన్యవాదాలు

రాజుపాలెం: మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను ఇంటర్మీడియట్ కో–ఎడ్యుకేషన్‌గా అప్‌గ్రేడ్ చేయించినందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను 1952లో స్థాపించారని, ప్రస్తుతం 119 మంది పదో తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. నాడు–నేడు పథకం ద్వారా 8 అదనపు తరగతి గదులు నిర్మించినట్లు చెప్పారు. 2024–25 అకడమిక్ ఇయర్‌కు ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీలకు అడ్మిషన్‌లు జరుగుతాయని ఎంఈఓ మల్లికార్జునశర్మ ఈ సందర్భంగా తెలిపారు. మండలంలో ఆరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, అక్కడి పదో తరగతి విద్యార్థులను ఇంటర్‌లో చేర్చే విధంగా ప్రేరేపిస్తామని తెలిపారు. జీడీసీఎంసీ డైరెక్టర్ ఆదినారాయణ, గణపవరం మాజీ సర్పంచ్ గన్నుపల్లి బుల్లిబాబు, సర్పంచ్ రామాంజనేయులు ఉన్నారు.

కౌలు రైతు కుటుంబానికి మంత్రి పరామర్శ

రుద్రవరం(ముప్పాళ్ళ): రుద్రవరం గ్రామంలో బలవన్మరణం పొందిన కౌలు రైతు మురారి నరేంద్ర కుటుంబాన్ని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం పరామర్శించారు. అతని మృతుకి గల కారణాలు తెలుసుకున్నారు. నరేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వ సాయం త్వరగా అందేలా చూస్తామని ధైర్యం చెప్పారు.

ప్రశాంత సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలి

సత్తెనపల్లి: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ కేఆర్, సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ కోరారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్, తదితర వాటిపై చర్చించారు. అనంతరం నవరత్నాల పథకాలు, తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీఓ వి.మురళీకృష్ణ, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ కేఆర్, ఆర్డీఓ మురళీ







పార్లమెంట్ రథసారథి వచ్చారు..

వైఎస్సార్ సీపీ నర్సరరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ పల్నాడులో ఘనస్వాగతం లభించింది. సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రంలో బీసీల బలం చూపిస్తామంటూ..ఎమ్మెల్యే నంబూరుశంకరరావుతో కలిసి ఆయన కత్తి దూశారు. రథ సారథిగా వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. క్రోసూరు మార్కెట్ యార్డులో నిర్వహించిన బీసీల ఆత్మీయ సదస్సు విజయవంతమైంది.

–పెదకూరపాడు/క్రోసూరు.

క్రమశిక్షణ చదువు ఉన్నతికి దోహదం


మాట్లాడుతున్న ఎస్ఐ షమీర్ బాషా

రాజుపాలెం: విద్యార్థులు క్రమశిక్షణ కలిగిన రోజునే ఉన్నత స్థాయికి ఎదుగుతారని, సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని రాజుపాలెం ఎస్ఐ షమీర్ బాషా పేర్కొన్నారు. గురువారం గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదువుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. బాలికలతో స్నేహ భావంగా ఉండాలని, అసభ్యకరంగా ప్రవర్తించకూడదని బాలురకు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం సుగుణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రూ.4.78లక్షల చెక్కులు బాధితులకు పంపిణీ


నగదు చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అనారోగ్యానికి గురై..వేల రూపాయల వైద్యం చేయించుకోలేని పేద రోగులకు ముఖ్య మంత్రి ఆర్థిక సహాయనిధి భరోసా కల్పిస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సత్తెనపల్లి పట్టణం, ముప్పాళ్ళ మండలానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు రూ.4.78 లక్షల సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ముఖ్య మంత్రి సహాయనిధి తోడ్పాటు అందిస్తోందన్నారు. బాధితుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన ఆమ్మినీడీ కోటేశ్వరమ్మకు రూ.60 వేలు, ఇందూరి లక్ష్మీకాంతమ్మకు రూ.1.20లక్షలు, పల్లపనేని కోటేశ్వరరావుకు రూ.60 వేలు, పట్టణానికి చెందిన పెరుమాళ్ళ సుజాతకు రూ.1.30 లక్షలు, షేక్ హాజీరాకు రూ.48వేలు, రూపేనగుంట్ల గ్రామానికి చెందిన మునగాల కుమారికి రూ.60 వేలు నగదు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, నాయకులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, అచ్యుత శివప్రసాద్, చిలకా జైపాల్, కొర్లకుంట వెంకటేశ్వర్లు, నల్లబోతు శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అబ్బూరులో భేటి బచావో–భేటి పడావో ర్యాలీ



సత్తెనపల్లి: మండలంలోని రెంటపాళ్ల సెక్టార్ పరిధిలో గల అబ్బూరు గ్రామంలో భేటి బచావో – భేటి పడావో అవగాహన ర్యాలీ గురువారం అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ జి.అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. బాలికలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు డి.పాపయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ ఆషా, మహిళా కార్యదర్శి రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.